రైట్స్ ఆఫ్ అడ్మిషన్



నేను తాగడానికి అలవాటు పడ్డాను. మూడు పూటలు సంధ్యావందనం నాలుగు పూటలు పూజా పునస్కారాలు చేస్తూ సద్బ్రాహ్మణులనిపించుకున్న పరమ వైదిక కుటుంబములో పుట్టిన నేను తాగడానికి అలవాటు పడ్డాను.

ఏ అలవాటులో అయినా పడడం సులభం కానీ, పడిన తరువాత బయట పడడం మాత్రం అంత సులభంకాదు. ఇది నా అనుభవం.

ఆ మధ్య నేనొక స్నేహితుడింటికి వెళ్ళాను. మనుషులంతా ఒకటేఅని, జాతులూ..... గీతులూ జాన్‌తానై అని గొంతెత్తి అరిచే ఈ రోజుల్లో కూడా ఆ భ్రమను వదల్లేని ఛాందసుడతగాడు. నాకు నమ్మకం లేని అతని మాటల్లోనే చెప్పాలంటే అతడు శూద్రుడు. నేను బ్రాహ్మణుడిని. అందుకే అతడు నన్ను చూస్తూనే ఎగిరిపడి లేచాడు. తన అర్ధాంగిని రమ్మన్నాడు. అతని మాటలను శిరసావహించి వచ్చిన విధేయురాలికి నన్నొక కవిగా పరిచయం చేస్తూ సతీసమేతంగా నా పాదాలకు ప్రణమిల్లాడు. ఆశీర్వాదాలపైన నమ్మకం లేకపోయినా

ఆశీర్వదించాను, బ్రాందీ కంపు నోటితోనే. నా ఆశీర్వాదంతో ఇద్దరూ పొంగి పోయారు. చేయి పైకెత్తడం వరకే పరిమితమైన నా ఆశీర్వాద బలం వాళ్లకే తెలియాలి మరి?

'ఆ తాగుబోతుకు పడి పడి దణ్ణం పెడుతున్నారా? మీకేమయినా పిచ్చి గిచ్చి పట్టిందా? రామ రామ! మొన్న ఆ బడి దగ్గర గుడ్డలు వీడిపొయ్యేది కూడా తెలియకుండా.....'

పధ్నాలుగేళ్ళ పిల్లవాడి నోరాడితే నా స్నేహితుడి చెయ్యాడింది. ఆ కుర్రవాడి లేతబుగ్గ పాపం కందిపోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి!

"నోటి కొచ్చినట్లు కూయడమేనా? పెద్దంతరం.... చిన్నంతరం ఉండక్కర్లా? కవిని దూషిస్తున్నావా? ఛీ.... బుద్ధిహీనుడా ఫో అవతలకి."

నా స్నేహితుడు రొప్పుతున్నాడు. ఎటూ మాట్లాడలేక మధ్య అతని భార్య నలిగి పోతూంది. ఆమె చూపులే పడుతున్న ఆవేదనను వ్యక్తం చేస్తున్నాయి. 'ఇంత జరగడానికి కారణం నీవేకదా!' అని అడుగుతున్నట్లున్నాయి. ఆ చూపుల్లో అర్థం నాకు స్ఫురించింది. తలవంచుకొని వెళ్ళిపోతున్న పిల్లవాడిని చేయిపట్టుకొని నిలిపాను. శిరస్సుపై చేయిఉంచాను. ఆప్యాయంగా తడుముతున్న నా ఎడమచేయి కందిన బుగ్గమీదికి మెల్లగా జారింది. రెండు కన్నీటిబొట్లు నా చేతిమీద ముత్యాల్లాపడి నా గుండెల్ని కెలికాయి.

"ఏడవకు నాయనా! మీ నాన్నకే బుద్ధిలేదు. నీవు బుద్ధిమంతుడివి. నిజంగా చాల గొప్పవాడివవుతావు" అని అన్నాను. ఆ మాటతో కూడా కుర్రవాడు వంచిన తలను ఒక పక్కకు తిప్పి కనురెప్పలు మాత్రం పైకెత్తి ఆ రెప్పలమాటుగా అదోరకంగా చూశాడు నన్ను. 'ఈ తాగుబోతు మాటలకు అర్థముందా?' అన్న భావన ఆ చూపుల్లో తొణికిసలాడుతూ ఉంది. నా స్నేహితుడు వాడి భార్య ఇద్దరూ ముద్దాయిల్లా నిలబడ్డారు. కొడుకుచేసిన చేతకు క్షమాపణ చెప్పుకోలేని తపన వాళ్ళది. నేను పిల్లవాడిని సముదాయించాలని గాని, తపనపడుతూ ఉన్న తల్లిని మెప్పించాలని గాని ఆ కుర్రాడి భవిష్యత్తుపై నమ్మకం చూపలేదు. తాగినమత్తు అసలే కాదు. నిజంగా నాభినుండి వెలువడ్డ మాటలివి. అందుకు కారణమూ లేకపోలేదు.

అదే చెప్తున్నాను.

నేను ముందే మనవి చేసుకొన్నాను, నిష్ఠాగరిష్టుడైన సద్బ్రాహ్మణుడి కడుపున చెడబుట్టిన లబ్ధప్రతిష్ఠుడనని. కారణంచెప్పలేను కాని ఆ లేత వయసులోనే లెక్కలేనన్ని ఆలోచనలు నన్ను తికమక పెట్టేవి. మననరనరాల్లో జీర్ణించిన అలవాట్లను సంప్రదాయమంటే దానికి ఎదురు తిరిగే మనస్తత్వం! తల్లి పొదుగుకోసం తపించే లేగదూడలా మనస్సు గుంజులాడేది. చెబితే తంతారు. చెప్పకపోతే తపన. ఈ ద్వైధీ భావనలో ఎటూ తోచకుండా తిరుగుతున్న రోజులవి. అప్పుడు జంధ్యాల పండగ వచ్చింది. అప్పటికే నాకు ఉపనయనం జరిపించి యజ్ఞోపవీతం పేరుపెట్టి నూలుపోగుల్ని తగిలించారు. గాయత్రి నేర్పించి మూడువేళలా జపించమన్నారు. ఎందుకని అడగనూ లేదు. చెప్పారని చేయనూ లేదు. గుడ్డ ముసుగేసుకొని పురోహితుడి

సమక్షంలో చెవిలో మూతిపెట్టి తండ్రి చెవిలో ఊదిన గాయత్రీ మంత్ర రహస్యం గాలికే వదిలేశాను. అందుకే ఆ పండగనాడు కూడా ఎక్కడెక్కడో తిరిగి వేళ తప్పి ఇంటికి వచ్చాను.

'ముఖాన తీర్చిదిద్దినట్లు మూడు నామాలు... పసుపు మరకలతో కొత్త జందెం... సరికొత్త పట్టుబట్టలు– చూడముచ్చటగా ఉన్నాడే నాన్న?' అనుకుంటుండగానే నా మీద విరుచుకపడ్డాడు. 'ఛీ! అప్రాచ్యుడా! నీ కెందుకురా! జంధ్యం!!' అంటూ నేలకు కొట్టిన బంతిలా ఎగిరిపడ్డాడు. మాట చెవినిబడిందో లేదో ఆ మాటకోసమే ఎదురుచూస్తున్నట్లుగా 'నిజమే నాన్నా! నాకెందుకు ఈ బంధం?' అని అంటూ పుటుక్కున తెంపాను. ఈ జగడానికి సాక్షీభూతంగా అరమోడ్పు కన్నులతో గడప ముందర సొంగకార్చుకుంటూ నిలబడి ఉందొక కుక్క . బహుశా దానికి గూడా పండుగని తెలిసే వచ్చిందేమో? చెమటతో మాగి, పొగచూరిన ఇంట్లో ఉట్టికి కట్టిన దారంలాగా ఉన్న జందెం తునకలై చేతిలో ఉంది. ఏమాత్రం సంకోచించకుండా ఆ కుక్కమెడలో వేశాను. నా తెంపరితనాన్ని భరించలేక నాన్న రెచ్చి పోయాడు. కొట్టిన దెబ్బతో వీధిలో పడ్డాను. శరీరం బాధకు లోనైతే మనస్సు సంతోషించింది. అంతే! మళ్ళీ నేనా ఇంట్లో అడుగుపెట్టలేదు. కానీ నేను అడుగుపెట్టిన ఇండ్లన్నీ నన్ను కవిగా గౌరవిస్తూనే ఉన్నాయి. అందుకే నదురూ... బెదురులేకుండా నిజాన్ని నిజంగా పలికిన ఆ పధ్నాలుగేళ్ళ కుర్రవాడి మీద నాకు అమితమైన గౌరవం ఏర్పడింది. వాడి భవిష్యత్తుపై నమ్మకం కుదిరింది. అసలు ఈ నమ్మకమే నన్ను ఈ స్థితికి తీసుకొని వచ్చింది. నమ్మిన సిద్ధాంతాన్ని గాని, నమ్మిన వ్యక్తిని గాని తెలిసి నట్టేట ముంచడం నావల్ల గాదు. ఆ కోవకు చెందిన వాళ్ళంటే నాకు గిట్టదు కూడా.

తాగుడు నన్ను చెడిపిందనీ, బ్రాహ్మణత్వ సుధాభాండంలో నేనొక ఉప్పుగల్లుగా పరిణమించాననీ, పరమ నైష్ఠికుడైన బ్రాహ్మడి కడుపున చెడబుట్టాననీ, నెత్తిన పెట్టుకొని పూజించవలసిన కవి చెత్తలాగా చూడబడుతున్నాననీ, దీనికంతకూ కారణం తాగుడేనని, నిప్పులాంటి ద్రవపదార్థాన్ని దెప్పే ఈ మనుషులకంటే ఆ ద్రవపదార్థం మీదనే నాకు ఎక్కువ గౌరవం. ఈ మనుషులనబడే వాళ్ళందరూ ఒకటి చెబుతారు. మరొకటి చేస్తారు. నమ్మించి గొంతులు కోస్తారు. నయ వంచకం బురఖాను తొడుక్కుంటారు. తడిగుడ్డలతో గొంతులు కోయడానికి తడబడరు. కానీ నేను వాడుతున్న హైక్లాస్ విస్కీకానీ, లోక్లాస్ నాటుసారా కానీ ఎప్పుడూ నమ్మకద్రోహం చేయలేదు. ఈ మనుషుల్లాగ ఒకటి చెప్పి మరొకటి చేయలేదు. 'ఇదో! నిన్ను నేనావహిస్తున్నాను. నీ బాధలకు, వ్యధలకు దూరంగా నిన్ను తీసుకొనిపోతాను. ఆనందాన్నందిస్తాను!' అని అంటుంది. అన్నంత పని చేస్తుంది. అటు తర్వాత కూడ, 'ఇదో నేను వెళ్ళిపోతున్నాను!' అని చెప్పి వెళ్ళిపోతుంది, నా తిప్పలు నాకు వదలిపెట్టి. ఈ మాత్రం ఇంగిత జ్ఞానంతో ప్రవర్తించే మనిషి నాకెప్పుడూ తటస్థపడలేదు, నా అర్ధాంగిని తప్పించి, అందుకే వాళ్ళిద్దరిమీద నాకు చాలా గౌరవం.

ఈ ఇద్దరిలో నా అర్ధాంగి నన్ను నమ్ముకొనింది. నేను తాగుణ్ణి నమ్ముకున్నాను. దీనికంతకూ కారణం మళ్ళీ నా అర్ధాంగి!

ఆమె శ్రీమంతుల ఇంట్లో పుట్టింది. చీకు చింతా లేకుండా పెరిగింది. ఊహా లోకాల్లో ఉవ్విళ్ళూరుతూ బతికింది. ఒక సభలో నా కవిత వినింది. మరొక సభలో నా ఉపన్యాసం చవి చూసింది. నన్ను నమ్ముకొని నా వెంట వచ్చేసింది. నా వెంట రమ్మని నేనామెను ఊరించనూ లేదు. వస్తానంటే వద్దని వారించనూ లేదు. తనంతట తానుగా వచ్చింది. ఈ గాలి పటానికి సూత్రం కట్టడానికి ప్రయత్నించింది. అంతకు ముందు పెట్టినచోట అంత తిని తిన్నచోట పడుకొని పడుకున్నచోట నాలుగు పద్యాలల్లుకోవడం– తెగిన గాలిపటంలాగ సాగింది బతుకు. ఇప్పుడు నాకొక తోడు. మా ఇద్దరికి కావలసి వచ్చిందొక గూడు. మిట్ట పల్లాలతో, వంకలు వాగులతో, రాళ్ళు రప్పలతో, చీకి పొదలతో నిండిపోయిన ఈ నేలమీద గూడు దొరకడమంటే మాటలా? దొరికిన గూట్లో నాతో ఇమడడానికి ఎంతో ప్రయత్నించింది నా అర్ధాంగి. కవిత్వమనే అందమైన పదాల కూర్పు ఈ దేశంలో కడుపుకు కూడు పెట్టదని కావలసిన కనీస సౌకర్యాలను కూడా సమకూర్చదని తెలుసుకొన్నపుడు ఆమె పరిస్థితి తలకిందులయింది. ఆమె బంగారు పంజరంలో చిలక అనుకుంటే ఆ చిలకల కొలికి నాపై కోపగించింది. సూర్యకాంతికి నిగనిగలాడే నీళ్ళలో మిలమిల మెరుస్తూ ఈదులాడే మీను ఆ మీనాక్షి అనుకుంటే ఆమె నీటి బయట చేప అయింది.

అర్ధాంగి అన్నాను గదా? ఆమె పరిస్థితి నీటిబయట చేపఅయితే ఇక నా గతి? నా అసమర్థత ఆమెను బాధపెట్టింది. నిజమే! అయితే నా పరిస్థితిని అర్థంచేసుకో లేకుండా ఆమె బాధపడి నన్ను బాధపెట్టిందా? లేదు– నేను బాధపడి ఆమెను బాధపెడుతున్నానా? అర్థంకాని స్థితి మనస్సుపై కాలుగీర్తే ప్రశాంతత లోపించింది. దాని ప్రభావం ప్రవర్తనలో. అదిగమనించిన ఒక పెద్దమనిషి నన్ను కారణం అడిగాడు. ఆ మనిషి నా మిత్రుడని చెప్పలేను. కాదని చెప్పలేను. అసలు మనిషి అవునో కాదో కూడా చెప్పలేను. అడిగినదానికి బదులు మాత్రం చెప్పాను. నాకు మానసిక ప్రశాంతత కావాలని చెప్పాను. 'అయితే నాతో రా!' అన్నాడు. వెళ్ళాను.

అందమైన బంగాళాలో ప్రత్యేకించి ఉన్నట్టున్న గదిలో కూర్చోబెట్టాడు. అమర్చి పెట్టినట్లు అందంగా ఉందా గది. టేబిలు మీద రెండు గ్లాసులు పెట్టాడు. రిఫ్రిజిరేటర్‌లో నుండి ఒక బాటిల్ తీశాడు. చూరులో నుండి కారిన వాన నీళ్ళులాంటి ద్రవపదార్థం ఉందా సీసాలో. కొలత కొలిచినట్లు రెండు గ్లాసుల్లో పోశాడు. అందులో సోడా కలిపాడు. ఒక గ్లాసు తాను తీసుకొంటూ నన్నొకటి తీసుకోమన్నాడు. తీసుకొన్నాను. 'ఛీర్స్' అని తన గ్లాసును నా గ్లాసుకు తాకించి నోటి కంటించుకున్నాడు. నేనూ అదే పని చేశాను మానసిక ప్రశాంతతకు అది మందేమో? అని.

కాఫీ దొరకని పల్లెటూళ్ళల్లో కాపు పడుచుల చేతి చిట్టుడుకు నీళ్ళు చవిచూశాను. చిన్నప్పుడు అమ్మ ముక్కు పట్టుకుని తాగించిన చిరుచేదు మందు రుచి ఎరిగి ఉన్నాను. ఈ రుచి మాత్రం కొత్త!

గుటగుట తాగేస్తుంటే, 'స్లో' గా 'సిప్' చేయమని సలహా ఇచ్చాడు. తాగేటప్పుడు గొంతులో కాస్త మంటగా తోచినా రెండు మూడు గ్లాసుల తరువాత ఎంతో హాయి అనిపించింది. ఆ మనిషికి 'థాంక్స్' చెప్పాను. గాలిలో తేలిపోతూ ఇంట్లోవాలాను. నా పరిస్థితిని గమనించిన అర్ధాంగి నన్ను తిట్టింది. కొట్టింది. ఓపిక ఉన్నంతసేపు జుట్టుపట్టి పీకింది. ఆ తరువాత అలిసి పడిపోయింది. ఇంత జరిగినా నాకేమీ బాధ అనిపించలేదు. ఆమెను మెల్లగా ఎత్తి మంచంమీద పడుకోబెట్టాను. ఆ మంచానికి ఎదురుగా గోడకానుకొని కూర్చున్నాను. అంత వరకే తెలిసింది నాకు.

అబ్బ! ఆ రోజు ఎంత హాయిగా గడిచిపోయింది!

నా హాయిని గుర్తించలేని మనుషులు, సాటి మనిషి ఆనందాన్ని సహించలేని ఈర్ష్యాళువులు నన్ను తాగుబోతు అంటున్నారని తెలిసి కూడా నేను ఏమాత్రం బాధపడలేదు. అందుకే తాగడానికి అలవాటు పడ్డాను. తరువాత ఏడెనిమిది రోజులు ఆ మిత్రుడింటికి వదలకుండా వెళ్ళాను. నారాకకోసమే కాచుకొని కూర్చున్నట్లు అతడు నన్ను సాదరంగా ఆహ్వానించాడు. ఆహ్వానిస్తూ చిరునవ్వు నవ్వాడు. 'నాకు తెలుసు నువ్వు వస్తావని!' అన్న భావన కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదా చిరునవ్వులో. 'చూశావా? నీలాంటి మహాకవికి కూడా మానసిక ప్రశాంతత ఇవ్వగలిగిన స్థోమత గలిగినవాణ్ణి' అన్న దర్పం తొణికిసలాడుతుందా చిరునవ్వులో. అతడి ప్రవర్తన నా అభిమానంపై చావుదెబ్బకొట్టింది. అందుకే ఆ మీదట అతనింటికి వెళ్ళలేక పోయాను.

రాతికి రంగులు పులిమి దేవుడనుకునే వాళ్ళు వరసబెట్టి వాళ్ళ కష్టాలు ఆ రాతితో మొరబెట్టుకొని ఊరట చెందుతారు. ఇహ పరలోకాలను సృష్టించుకొని, ఈ లోకంలో అనుభవిస్తున్న కష్టాలకు కారణం జన్మజన్మాల ఫలితంతో ముడిపెట్టి కొందరు సరిపెట్టుకొంటారు. తాళిగట్టిన పెళ్ళాంతో కొందరు తలపోసుకొంటారు. స్నేహితులతో కొందరు వెలపోసుకొంటారు. ఎవ్వరిమీద నమ్మకం కుదరని నాకెవరుంటారు? ఉన్న ఆ ఇద్దరిలో ఒకరు వినిపించుకునే స్థితిలో లేరు. మరొకరు కాసులివ్వందే కరుణించరు. పద్యాలయితే వస్తాయి– రాసులు పోయగలిగినన్ని వస్తాయి. పద్యాల రాసులకు కాసులు రాలేటట్టుంటే మరి ఈ గతి ఎందుకు పట్టుతుంది?

అల్లారుముద్దుగా అందాలమేడల్లో పెరిగిన ఆమె ఆ పూటకూటికి సతమతమవడం జీర్ణించుకోలేక పోయింది. తోడుకు అగ్గికి గాలి తోడైనట్టు నేను తాగడం. పరిస్థితుల్తో రాజీపడలేక... నన్ను వదల్లేక దాదాపు ఆమెకు పిచ్చిపట్టింది. ఆ స్థితిలో ఆమె ఏమిచేస్తుందో ఆమెకే తెలియదు. నా అసమర్థత ఆమెచేతికి దొరికిన ఆయుధమైతే ఆ యుద్ధంలో నేను నిరాయుధుణ్ణి. పిచ్చి ఆవేశంలో తిట్టినా కొట్టినా భరించాను కాని– అలవాటైన పిచ్చిని భరించడం కష్టసాధ్యమైంది!– ఏం చేయాలి?

'ఏముంది? కొని తాగచ్చుకదా?' అంటారు నా పరిస్థితిని గ్రహించిన వాళ్ళు. తాగచ్చు కానీ, అప్పటికి ఆంధ్రదేశంలో గాంధీగారి సూత్రాలకు నూరేళ్ళు నిండలేదు. అందుకే

మద్యపాననిషేధం అమలులో ఉంది. నాలాంటివాడెవడైనా తాగాలంటే దొంగ చాటుగా నాలుగు కాసులుఎక్కువగా పెట్టాలి. నాలుగుకాసులు ఎక్కువపెట్టినా దొరికినా మళ్ళీ ముసుగుబతుకే. దేశంలో పెద్ద పెద్ద నాయకులు ధనికులు ముసుగు బతుకుల్లో మునిగి ఆనందంలో తేలిపోతున్నారు. మహాత్ముడు కష్టపడి స్వయంగా వడికి నేసి వీళ్ళందరికీ బురఖాలు సప్లయి చేశాడు. అందుకే అలాంటి నాయకుల ఇండ్లల్లో రెఫ్రిజిరేటర్లలో వాట్-69లు ఉంటాయి. నిషేధాజ్ఞలు ఆ రెఫ్రిజిరేటర్లలో దూరి చల్లబడి పోతుంటాయి. దీనిని చూస్తున్న సామాన్యుడు నోరు చప్పరిస్తూ, 'పెట్టిపుట్టిన అదృష్టవంతులు అనుభవిస్తున్నారు'అని సరిపెట్టుకొంటాడు. పూర్వజన్మలో పెట్టలేక సామాన్యుడుగా పుట్టిన సామాన్యుడు ఈ జన్మలో కూడా పెట్టలేక మరోజన్మలో కూడా అతి సామాన్యుడుగానే పుడుతున్నాడని నమ్మిన సిద్ధాంతం. నేనెంత కవిత్వం రాస్తే ఈ సిద్ధాంతం మారేది?

పాండిచ్చేరిలో ఈ అవస్థ లేదట. ఎక్కడబడితే అక్కడ దొరుకుతుందట. తనివితీరా తాగి తన్మయత్వంతో తిరగవచ్చట! ఒక దేశంలోనే ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి మధ్య ఇంత తేడా తగదని ఆలోచించవలసిన కవిని దొంగచాటుగా తాగి ఆత్మవంచనకు పాల్పడలేక పాండిచ్చేరికి ప్రయాణం కట్టాను తాత్కాలిక ఉపశమనం కోసం.

ఒక సరళరేఖను సముద్రతీరాన్నంటి పెట్టుకొని గీచినట్లు పెద్దబాట... ఆ బాటమీద నాలుగు లంబరేఖలు గీచినట్లు పశ్చిమంగా విస్తరించి, ఊరిని నాలుగు సమభాగాలుగా విభజిస్తూ నాలుగు రోడ్లు.... చూడ ముచ్చటగా ఉంది పాండిచ్చేరి. ఆంధ్రదేశంలో సుమారు పాటి ఓ తాలూకా విస్తీర్ణం గలిగిన ఓ ప్రత్యేక రాష్ట్రం అది. ఆ రాష్ట్రానికి రాజధాని పాండిచ్చేరి. ఆ రాజధానిలో ఎత్తయిన మేడలున్నాయి. సుమారుపాటి సుద్ద మిద్దెలున్నాయి. శివార్లలో చిన్న చిన్న గుడిసెలున్నాయి. మేడల్లో సుమారుపాటి మిద్దెల్లో పూరి గుడిసెల్లో మనషులు న్నారు. దేవుడు సృష్టించిన మనుషులున్నారు. అయితే ఆ మనుషుల్లో విభేదాలు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. గుడిసెలో మనిషి 'నాటు' ఆత్రంగా జుర్రుకొంటుంటే, మేడలో మనిషి 'వాట్' నంజి నంజి తాగుతూ ఉంటాడు. ఈ తాగుబోతు వెధవ అలంకారప్రాయంగా కూడా తాగుడు మాటలే మాట్లాడుతున్నాడనుకోకండి. మీ మాటల్లో చెప్పాలంటే- ఒకడు గంజి తాగుతుంటే, ఆ గంజికి కూడా నోచుకోని దౌర్భాగ్యుడొకడు ఎవరో పుణ్యాత్ముడు వదిలిపెట్టిన ఎంగిలాకులోని పంచభక్ష్య పరమాన్నం కోసం కుక్కలతో కాట్లాడుతున్నాడు. పూలమాలలతో రాజకీయ నాయకులు, కాగితాలతో రచయితలు సతమతమవుతూనే ఉన్నారు, సమతా సాధన కోసం. వీళ్ళు ఆగరు- అది జరగదు. అస్తవ్యస్తంగా ఉన్న ఈ సమాజానికి దర్పణం పట్టినట్టుగా ఉంది ఆ పట్టణం కూడా. అంతవరకూ హద్దూ పద్దూ లేకుండా వాగి అధికార దర్పానికి మార్పులు చేర్పులు చేసుకొంటున్న బుర్రమీసాల పోలీసు అనుకోకుండా ఊడిపడ్డ పై అధికారిని చూసి ఎగిరిపడి లేచి చేష్టలుడిగి నిలబడి సెల్యూట్ చేసినట్లు ఆటుపోట్లతో అల్లకల్లోలంగా ఉండే సముద్రం ఆ పట్టణం దగ్గర ప్రశాంతంగా ఉంది.

పొద్దస్తమానమూ ఊరంతా తిరగనిచోటు లేనట్లుగా తిరిగాను. గమ్యము లేకుండా గాలివాటంగా తిరిగే బెలూన్‌లా గాలిలో తేలిపోతూ తిరిగాను. కామెర్లకంటి వాడికి ప్రపంచ మంతా పచ్చగా కన్పిస్తుందేమో? నా పిచ్చి నాకు ఇంపుగా ఉంది. ఎక్కడ చూసినా బ్రాందీ అంగళ్ళే! అంగళ్ళ నిండుకూ బీరువాలే! బీరువాల నిండుకూ ముచ్చటైన సీసాలే! ప్రపంచములోని ఆనందాన్నంతా పట్టి తెచ్చి ఆ సీసాల్లో నింపారు. జాగ్రత్తగా సీలువేశారు. బీరువాల్లో భద్రపరిచారు. చూస్తున్న కొద్దీ ఆనందంతో వ్యాపారం చేసుకొంటున్న స్వార్థులైన మనుషుల మీద కసి పెరుగుతూ ఉంది. గోరంత ఆనందం గుండెల్లో దూరితే ముప్పైమూడు వంకర్లు తిరిగే మనుషులకంటే గొంతువరకు ఆనందాన్ని నింపుకొన్న ఆ సీసాలు నిబ్బరంగా బీరువాల్లో నిలబడి ఉంటే వాటిమీద గౌరవం పెరిగింది.

అప్పుడు చిత్రంగా నా మనసులో మెదిలింది అరవిందాశ్రమం!

ఆశ్రమాల్లో దొరికే మానసిక ప్రశాంతతను గురించి నాకు తెలియదు. ఆశ్రమాల్ని అడ్డంపెట్టుకొన్న మతంమీద నాకు తగని మంట. ఆశ్రమాల మీద మతాల మీద నాకు నమ్మకమూ లేదు. నేను నమ్మింది, నాకు ఆనందాన్నిచ్చింది సీసాలోని ద్రవపదార్థమే. అందుకే ఆ సమయంలో ఆశ్రమం కన్నా తాగడానికి ఆశ్రయంకోసం మనస్సు మథనపడుతూ ఉంది. వీధికొక బారు ఆహ్వానిస్తున్నా వాటి తీరుతెన్నులు చూసి మనస్సు అటువైపు మొగ్గలేదు. అన్నీ డెన్‌లాగా ఉన్నాయి. నిజానికి ఈ మనస్సు చాలా చిత్రమయింది. హీనులు... దీనులు... తాడితులు... పీడితులు... ఈ మనస్సును స్పందిస్తారు. సామాన్యులకు ఈ మనస్సులో చోటు ఉంది. ఈ స్పందనలోనే కవిత్వ సృష్టి జరుగుతూ ఉంది. ఆ కవిత్వానికి కన్నీటి అభిషేకాలు జరుగుతుంటాయి. డెన్‌లాంటి ఈ బార్‌లలో కూడా సామాన్యులే ఉంటారు. అయినా సామాన్యుల్లో ఒక సామాన్యుడు కావడానికే మనసు అంగీకరించలేదు! అందుకే కవిస్థాయికి తగిన బార్ కోసరం వెదుకుతున్నాను.

సముద్ర తీరానికి సమాంతరంగా ఉన్న బాటమీద ఒక పెద్ద భవనం కనిపించింది. ఆ భవనం ముందు 'హోటల్ కాంటినెంటల్-బార్ అండ్ రెస్టారెంట్' అని అందమైన బోర్డు వేలాడుతూ ఉంది. జిహ్వలాగుతుంటే హోటల్ దగ్గరికి గబగబ నడిచాను. ఆ బార్లో అడుగు పెట్టబోయాను.

"ఠైరో!"– ఘూర్కా చేతికర్రను అడ్డంపెట్టాడు.

వీడేమిటి? పానకంలో పుడకలా! అని ముందుకు పోవడానికి ప్రయత్నించాను. నాలాంటి జానాబెత్తెడు మనిషికి ఆ కర్రను దాటడం అశక్యమని తేలిన తర్వాత కాసేపు తెలుగులో కాసేపు ఇంగ్లీషులో విసుక్కున్నాను. అరవ భాషలో కోపగించుకోవడానికి ప్రయత్నించాను. వాడిది ఒకటే పట్టు. అడ్డుపెట్టిన కర్రను అటూ ఇటూ కదల్చకుండా వాడికి వచ్చిన ఒకటే భాషను దంచేస్తున్నాడు. నాలో ఓపిక నశించింది. ఏదైనా ఓర్చుకోవచ్చునేమో కానీ, మనిషి సాటిమనిషి ఆనందానికి అడ్డపడుతూంటే ఓర్చుకోవడం కష్టమే! బెత్తెడంత మనిషి గుప్పెడు పైకి లేచాను.

అదే స్థాయికి గొంతుస్థాయిని కూడా పెంచాను. అన్ని భాషలు కలిపి గుప్పుతున్నాను. ప్రశాంతంగా ఉన్న 'కాంటినెంటల్' బార్ ముందు మా వాగ్యుద్ధం పెద్ద రంపుకింద లెక్కే! మేనేజరు పరుగెత్తుకొని వచ్చాడు!

ఎగాదిగా నన్నొకసారి చూశాడు మేనేజరు. వెనక్కు ముందుకూ ఊసరవెల్లిలా ఊగాడు. రెండుచేతులను రెండుజేబుల్లో దురుక్కొన్నాడు. ఒక కాలు వెనక్కు మరొక కాలు ముందుకు పెట్టుకొని రాజఠీవిని ఒలకబోస్తూ అలంకారప్రాయంగా ఓ వెకిలి నవ్వు నవ్వాడు.

ఆ వెకిలి నవ్వుకు కారణం అతడు ధరించిన తెల్లటి రిమ్‌లెస్ కళ్ళద్దాల అంచుల్లో కనపడింది. నల్లగా మాసిన నాలుగు మూరల పంచ.... చిరుగులు పడడానికి సిద్ధంగా ఉన్న జుబ్బా... అంచులు తేసిపోయి అక్కడక్కడ సరిగ మాత్రం మిగిలిఉన్న పైపంచ- కాంటినెంటల్ హోటల్ మేనేజరుగారికి వెకిలినవ్వు తెప్పించడంలో ఆశ్చర్యం లేదు.

వెకిలి నవ్వు తర్వాత మనిషి ఏటవాలుగా వాలాడు. ఎడమచేతిని జేబునుండి ఒర నుండి కత్తిని లాగినట్లు సరక్‌మని లాగాడు. నన్నొక కోణంలో చూస్తూ ఎడమచేతితో నాకొక బోర్డు చూపించాడు. బోర్డువైపు చూశాను. ఊదారంగు ప్లాస్టిక్ ఇంగ్లీషు అక్షరాలు చూడడానికి ముచ్చటగా ఉన్నాయి. చదువుకుంటే గతుక్కుమనింది. 'రైట్స్ ఆఫ్ అడ్మిషన్ రిజర్వ్డు' అని ఉంది. ఈ దేహానికి సవాలక్ష సందేహాలు! అందుకే-

"అయితే ఎవరికి ప్రవేశం?"

"మీలాంటివాళ్ళకు మాత్రం కాదు."

"కారణం?"

"మీ వేషం హైక్లాస్ సొసైటీలో అతకదు కాబట్టి!"

"హైక్లాస్ సొసైటీ ఒక్కవేషం మీదనే ఆధారపడిందా?"

"అని ఈ హోటలు అధినేతలు అభిప్రాయపడుతున్నారు."

"ఈలాంటి దురభిప్రాయాలతోనే దేశం ఇలా అధోగతిపాలవుతూ ఉంది."

"చాలా చాల పెద్దమాటలే!"

"మీ హైక్లాస్ సొసైటీవాళ్ళ మాటలకంటేనా?"

"అలాగే అనిపిస్తూ ఉంది. ఇంతకూ మీరెవ్వరు?"

"మనిషిని."

"అది తెలుస్తూనే ఉంది."

"అయితే అడగడమెందుకూ?"

"మనిషిగా మనిషిదగ్గర సమాధానం పొందడానికి!"

నాకు ఆశ్చర్యం కలిగింది. కాంటినెంటల్‌హోటలు మేనేజరు సెంటిమెంటల్ ఫూల్ కాదనిపించింది. దారాన్ని లాగితే రెండు చేతులు వేరవుతాయి. వాదాన్ని లాగితే రెండు చేతులు కలుస్తాయి. చేతులు కలపడం ఆరోగ్యప్రదం కాదు.

"తెలుసుకొని ఏం లాభం?"

"అది తర్వాత తెలుస్తుంది" అన్నాడు ధీమాగా.

"అయితే నేనొక కవిని! ఆంధ్రదేశం నుండి వచ్చిన కవిని."

ఆ మాట చెవిని పడడంతో ఏదో అపచారం చేసినవాడిలాగ అతడి మొగం ముడచక పోయింది- చేయితగిలితే అంతర్ధామరలాగా! "మీరు కవులా? మీరు కవులా?" అని ఒకటికి రెండు మూడుసార్లు అస్పష్టంగా గొణుక్కున్నాడు. నాకు మరింత ఆశ్చర్యం కలిగింది. తెలుగుకవికి తెలుగుదేశంలో దొరకని గుర్తింపు అరవదేశంలో దొరుకుతున్నందుకు! అంతవరకు మనసులో పేరుకొన్న అసంతృప్తి వేడికి వెన్నలా కరిగిపోయింది.

"నాతో రండి!" అని ముందుకు నడిచాడు మేనేజరు.

వెళ్ళాను. అభిమానధనుడైన దుర్యోధనుడు హాయిగా స్వగతం పలుక్కున్నాడు మయసభలో. నా పాలిటికి ఆ హోటల్ ఒక మయసభలాగ ప్రత్యక్షమైనా నేను దుర్యోధనుడంతటివాడిని కాను. అంతటి అభిమానము నాలో మిగలలేదు. బిత్తరపడి చూస్తూ నిలబడ్డాను. గోడల్లో నీడలు కనిపిస్తున్నాయి. కూర్చుంటే మైలపడతామని కుర్చీలు వెక్కిరిస్తున్నాయి. అందమైన చిత్రాలు ఆనందాన్ననుభవించమని ప్రేరేపిస్తున్నాయి. చూపుమేరలో నీలాలు పారే కడలి నింగితో కలిసి సహవాస దోషమన్నట్లు నిర్మలంగా ఉంది. అప్పుడే రేవులో నిలబడ్డ నౌకనుండి దిగిన ప్రయాణీకులు కడలిమీద కట్టిన వంతెనమీద నడుస్తూ తిరిగితిరిగి చూస్తున్నారు, మరుల తెరలు వెనక్కు లాగుతుంటే! విచిత్రమైన అనుభూతి మనస్సును మత్తెక్కిస్తూ ఉంది. దీనికి తోడు అరసీసా ఖాళీచేస్తే అక్కడే కాపురం పెట్టచ్చునన్న ఆశ మోసులు వేస్తూ ఉంది.

"కవిగారూ!"

"తిరిగి చూశాను."

"ఈ సొసైటీలో మీకు చోటు లేదు. మిమ్మల్ని ఇక్కడ ప్రవేశపెట్టిన సంగతి అధినేతల చెవినిపడ్తే ఆ మీదట నాకు కూడా ఇక్కడ చోటు ఉండదు. అయినా మీరు కవులు. సమాజములో మీకొక ప్రత్యేకస్థానముంది. అందుకే ఇక్కడ కూడ మీకొక ప్రత్యేకస్థానం ఇస్తున్నాను. అదిగో! ఆ గదిలో కూర్చోండి. సరిగ్గా అరగంట మీకు వ్యవధి ఇస్తున్నాను. మీకు చెప్పవలసిన పనిలేదు. నేను ఒకరికింద వంగిన ఉద్యోగిని!"

మనస్సు ఉబ్బిపోయింది తడిసిన బెండులాగ. మేనేజరుగారి అభిమానానికి విలువ కట్టలేని మనసుకు చేతులు వస్తే- జోడించాను. 'థేంక్స్'- అన్న ఒక్క మాటతో గదిలో ప్రవేశించాను. లోకంలో నాకు మిగిలిన ఇద్దరు మిత్రులలో ఒకరు నాభార్య. రెండవది మద్యం. ఒకరు తన్నుతాను మరిచిన స్థితిలో ఇంట్లో ఉన్నారు. మరొకరు నన్ను నేను మరిచిపోవడానికి నా ఒంట్లో ప్రవేశిస్తున్నారు. అయినా సరిగ్గా ఇరవైతొమ్మిదవ నిముషంలో కాంటినెంటల్ హోటల్ కౌంటర్ దగ్గర నిలబడ్డాను. రెండు బీరుబాటిల్స్ ఖాళీచేసి. చిల్లులుపడ్డ జుబ్బా జేబు నుండి

మాసిన కాగితాన్ని తీసి టేబిలుమీద పెట్టాను. నేను ఇప్పుడు ఒంటరివాణ్ణి కాదు. నాలో ఒకడున్నాడన్న దర్పం తొణికిసలాడుతూ ఉంది ప్రతి చేతలో. మాసిన కాగితాన్ని టేబిలు మీద పెట్టిన తీరే ఈ సత్యానికి సాక్షి!

మేనేజరు ఎగిరిపడిలేచాడు. రెండు చేతులు జోడించాడు. 'క్షమించండి' అన్నాడు.

"ఎవరు ఎవర్ని?"–

"మీరు నన్నే!"

"కారణం?"

"వేషంమీదనే సంస్కారం ఆధారపడి ఉందని వాదించినందుకు!"

"ఎలా గ్రహించావు?"

"ముప్పై నిముషాల వ్యవధియిస్తే, సరిగ్గా ఇరవైతొమ్మిదవ నిముషంలో మీరిక్కడ నిలబడడంతో!"

"ఇదొక్కటే సంస్కార లక్షణమా!"

"కాకపోవచ్చు. కానీ నాతో రండి" అన్నాడు.

"మరి ఈ వేషం?" అన్నాను సందేహంగా.

"క్షమించమని అడిగాను కదా? దయచేసి మళ్ళీ ఆ ప్రసక్తి తేకండి. రండి!" అంటూ లోపలికి నడిచాడు.

నేను వెంటనడిచాను. లోనికి వెళ్ళి ఒక అందమైన తలుపును లోపలికి నెట్టాడు. కిర్రుమని శబ్దం చేసిందా తలుపు. ఒళ్ళు పులకరించే దృశ్యం... చల్లని గాలులు గిలిగింతలు పెడుతుంటే ఖరీదైన ద్రవపదార్థాల వాసన గుప్పుమని ముక్కుపుటాలను తాకింది. అదొక 'ఏర్ కండీషన్డ్ హాలు'. హాలు శుభ్రంగా ఉంది. హాలునిండుకూ అందమైన కుర్చీలు, టేబిళ్ళు ఉన్నాయి. కుర్చీలమీద ఖరీదైన దుస్తులు కైపులో తూలుతున్నాయి. రోగం వచ్చిన కోళ్ళు కళ్ళు తేలేసినట్టు కొందరు కళ్ళు తేలేశారు. కొందరి మెడలమీద తలలు నిలబడడమే లేదు. కొందరు టేబిలుమీద అలానే వాలిపోయారు. కొందరు సొంగకారుస్తున్నారు. కొందరు మరి కొందరిని చూసీ చూడనట్లు చూసి నవ్వీ నవ్వనట్లు నవ్వుతున్నారు. కొందరు ధీమాగా కూర్చొని సిగరెట్ పొగవలయాల్లో అందాలు వెదుకుతున్నారు. ఊహాతీతమైన ఆ లోకం లోకాతీతంగా ఉంది.

"ఇది తాగు."

"అహాఁ! ఇక నాకు వద్దు!"

"అలా కాదు. తాగి తీరాల్సిందే!"

"ఇక నేను చచ్చినా తాగనంటే తాగను!"

"భర్త మాటను భార్య అంగీకరించాలి!"

"భార్య అభిప్రాయాన్ని భర్త గౌరవించాలి!"

'ఛత్' మన్న చీదరింపుకు 'టక్' మన్న శబ్దం శ్రుతికలిపింది. అందమైన గ్లాసు ముక్కలుముక్కలైంది. అందులో ద్రవపదార్థం టేబిలుమీద గబగబ పారాడి అందమైన దుస్తుల్లో ఆత్మార్పణ చేసుకొని మరకల్ని మాత్రం మిగిల్చింది. రంగు లైట్ల కాంతిలో పగిలిన గ్లాసు పెంకులు పకపకనవ్వుతున్నాయి!

హాల్లో మేము నిలబడిన టేబిలు దగ్గర జరిగిన సంఘటన. ఎవరో ఇద్దరు అమెరికన్ దంపతులు ఇంగ్లీషులో కీచులాడుకొంటున్నారు. ప్రశ్నార్థకంగా చూశాడు నావైపు మేనేజరు. ఆ చూపుల్లో 'చూశారా! హైక్లాస్ సొసైటీని?' అన్న అర్థముంది. ఇలాంటి 'వాళ్ళతో ఎలా వేగడం?' అన్న అభ్యర్థన ఉంది. నేను అక్కడి నుండి కదిలి అమెరికను దంపతుల మధ్యగా నిలబడ్డాను. ఆ అమెరికను నన్ను ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఆయన ఒక కవి. ఆంధ్ర దేశం నుండి వచ్చిన ఒక కవి!" మేనేజరు పరిచయం చేశాడు ఇంగ్లీషులో. గ్లాసు పగలడం వరకు పెరిగిన ఆ కీచులాట పోట్లాటగా మారు తుందేమో అన్న భయం మాకు లేకపోలేదు. కావలిస్తే సర్దిచెప్పడం, లేదా తమకు తామే సర్దుకోవడంలో ఆంధ్రులు గట్టివాళ్ళుగదా? అందులో నేను కవిని. అలాంటి తెలివితేటలు నాకు మరి కొంచెం ఎక్కువ మోతాదులోనే ఉండాలి. అందుకే ఆ బాధ్యత నాకు నేనుగా నెత్తిన పెట్టుకోదలిచాను. అయితే నన్ను నేను పరిచయం చేసుకోవడానికి కాస్త ఇబ్బంది పడ్డాను. మేనేజరు పుణ్యం కట్టుకొన్నాడు. అతడి సందర్భశుద్ధికి కవి హృదయం పులకించింది.

"ఓః!కవులా?....రండి....రండి! కూర్చోండి. నాకు కవులంటే చాలా ఇష్టం." వ్యాట్‌సిక్స్‌టీ నైన్ నంజి నంజీ తాగినట్టుగా ముద్దు ముద్దుగా పలికాడు అమెరికనుడు.

రోగి కోరింది, వైద్యుడు చెప్పింది- రెండూ ఒకటే!...

నేను చిరునవ్వు నవ్వాను.

"ఔనౌను! మా వారికి కవులంటే చాలా యిష్టం... తన భార్యకంటే కూడా!" నన్నొకరకంగా చూస్తూ- ఆదో రకంగా నవ్వింది. ఆ యువతి- అదే ఆ అమెరికన్ సతీమణి! ఆ వ్యంగోక్తికి మనసు కొంతకు కొంత బాధపడినా, ఆమె కలుపుగోలు తనానికి ఆనందపడ్డాను! కుర్చీలో కూర్చున్నాను. ఇక పరిస్థితి చక్కబడుతుందని మేనేజరు టై సర్దుకొంటున్నాడు దర్జాగా!

"కావచ్చు! కావచ్చు!...బాయ్? వన్‌మోర్ విస్కీ" ముసిముసిగా గొణుక్కున్నాడు అమెరికనుడు. అందుకోసమే కాచుక్కూర్చున్న బేరర్ క్షణాలలో సరంజామాతో ప్రత్యక్ష మయ్యాడు. 'దయచేసి తీసుకోండి!' అంటూ గ్లాసు నావైపు నెట్టాడు అమెరికనుడు. 'ప్లీజ్!' అంటూ నేను ఆ గ్లాసును అతని సతీమణి వైపు నెట్టాను. ఆమె కాస్త ఇబ్బందిగా ముఖం పెట్టినా అతిథి మర్యాదలు తెలిసి గ్లాసు అందుకొనింది.

"ఓః! నా భార్యకు భర్తమాట కంటే కవుల మాటమీదనే చాల గౌరవంగా ఉందే!" అశ్చర్యాన్ని వెలిబుచ్చాడతడు.

"అఫ్‌కోర్సు!" అంటూ ఆమె గ్లాసును నోటి కందించింది.

"మీరు కోరడం ఆమె తాగాలని! ఆమె తాగుతూ ఉంది. ఇక వాదాని కిక్కడ తావులేదు. మనం స్నేహితులం. కానివ్వండి." అంటూ నేనొక గ్లాసు అందుకొన్నాను.

పరిస్థితి చక్కబడినందుకు మేనేజరు కృతజ్ఞతాభావంతో నన్ను చూశాడు. బదులుగా నా చిరునవ్వును మోసుకొని బయటికి నడిచాడు. మేం ముగ్గురం మాటల్లో పడ్డాం. ముద్దు ముద్దుగ మాట్లాడుతూ నంజి నంజి తాగుతున్నాం. ఆ సందర్భంలో నా కవితను వినాలన్న సద్బుద్ధి కలిగిందా దంపతులకు. తెలుగు కవిత్వాన్ని ఇంగ్లీషులో వివరించలేక నేనూ... వివరించింది పూర్తిగా అర్థంగాక వాళ్ళూ– ఇద్దరికీ పొత్తు కుదర్చలేక మధ్య మధ్య నిర్దాక్షిణ్యంగా నలిగిపోతున్న... వెకిలి నవ్వులు– గంట పది కావస్తోంది. ఉన్నట్టుండి చేతి గడియారాన్ని చూసుకున్నాడా విదేశీయుడు. కొంపలు మునిగినంత గాభరా పడ్డాడు. ఎంతో పొరపాటు జరిగిపోయినట్లుగా బాధపడ్డాడు. భార్యను తొందరగా లెమ్మని బ్రతిమలాడాడు. 'మళ్ళీ కలుసుకుందా!' అంటూ నావద్ద సెలవు తీసుకొన్నాడు. ఇంతకూ అతని అదుర్దా ఏమిటంటే– సరిగా పదిగంటలకు ఎవరినో కలుసుకుంటానని మాట ఇచ్చాడట. తాగిన ఆ మత్తులో కూడ ఆ విదేశీయుడికి మాటమీద ఉన్న గౌరవం. నా అభినందన దోచుకొనింది.

తాగుబోతులందర్నీ ఒక గాట కట్టేస్తే ఆ గుంపు తెలివిగా కొన్ని పద్ధతుల్ని నిర్ణయించు కొనింది. తాగుబోతులకు కూడా పద్ధతులా? అని హేళన చేయవలసిన అవసరం లేదు. ఈ పద్ధతిని 'టేబిలు మేనర్స్' అంటారు. ఈ మేనర్స్ మనవాళ్ళకంటే విదేశీయులకే బాగా తెలుసు. మనవాళ్ళయితే– ఒకరి ముఖం ఒకరు చూసుకొంటూ అప్పటికప్పుడు నాట్యావధానాలు ప్రదర్శిస్తారు. అథవా తెగించి బిల్లు చెల్లించినా నాకు తాగుడు నేర్పిన మహాశయుడి మాదిర దర్పాలు పోవచ్చు. నన్ను ఆహ్వానించిందొక విదేశీయుడు. అందుకే నా బిల్లు కూడా అతడే చెల్లించాడు.

ఆ దంపతులు వెళ్ళిన తరువాత నేను మేనేజరు దగ్గర సెలవు తీసుకోవడానికి వెళ్ళాను. నన్ను చూసీ చూడగానే గబగబ లేచి వచ్చాడు మేనేజరు.

"మేనేజర్‌గారూ! చాలా కృతజ్ఞుణ్ణి. సెలవు." అని అడగదామనుకొన్నాను. అడగ దామనుకొన్నది అడగలేకపోతున్నాను. నా అవస్థను గమనించాడు మేనేజరు.

"కవిగారూ! ఈ పరిస్థితిలో మీరు వెళ్ళడం నాకిష్టం లేదు. నేనిక్కడ కేవలం ఒక ఉద్యోగిని మాత్రమే. అయినా మీకోసం ఆనందంగా పాతిక రూపాయలు ఖర్చుపెట్టగలను, గది అద్దెకోసం. ఈ రాత్రికి ఇక్కడే విశ్రాంతి తీసుకోండి." అని ప్రాధేయపడ్డాడు మేనేజరు.

"నేనిప్పుడు అరవిందుడిని చూడాలి. అది నా కోరిక కాదు, నాలో మందుప్రేరణ."

"ఇప్పుడా? ఈ స్థితిలోనా?"

"అవును! ఇప్పుడే..... ఈ స్థితిలోనే!"

"మిమ్మల్నిప్పుడు ఆశ్రమంలోనికి రానివ్వరే?"

"అదే తెలుసుకో.... కాదు- తేల్చుకో దలిచాను."

"కవిగారూ! నామాట వినండి. బయట సన్నగా వర్షం పడ్తూ ఉంది. ఆశ్రమం దాదాపు మైలుదూరానికి పైగా ఉంటుంది. ఈ రాత్రిలో ఈ వర్షంలో.... ఈ స్థితిలో..... మీరక్కడికి నడిచి వెళ్ళడం?....."

కాదన్న పనిని అవుననిపించడం చిన్నప్పటినుంచి నాకు మహా ఇష్టం.

బార్ నిర్వహిస్తున్న మనిషి మేనేజరు. మానవుడి బలహీనతతో వ్యాపారం చేసుకొంటున్న మనిషిగా అతనిని లోకం ఆడిపోసుకొంటుంది. అయినా అతనిలోని మానవత నన్ను ముగ్ధుణ్ణి చేసింది. కాని నన్నక్కడ నిలబెట్టలేకపోయింది.

నేను ఆశ్రమాన్ని సమీపించేసరికి దాదాపు అర్ధరాత్రి కావస్తూ ఉంది. అంతవరకు నాకు తోడుగా ఉండిన నాలోని మిత్రుడు నేను దారికి అడ్డదిడ్డంగా నడిచినా, బురదగుంటల్లో పడినా, పట్టిలేపి ఆశ్రమాన్ని చేర్పించి వీడ్కోలు పుచ్చుకోవడానికి ఆతురతపడుతున్నాడు. సన్నగా రాలుతున్న చినుకులు...దారిపక్కన బురద గుంటలు....ఆంధ్రదేశం నుండి వచ్చిన కవిని పరామర్శించిన ఫలితంగా కవి వేషం దివ్యంగా తయారయింది. నేను ఆశ్రమంలోనికి అడుగు పెట్టబోయాను.

"ఆగండి!" చేయి అడ్డు తగిలింది.

ఆగాను. అతనివైపు చూశాను. ఆశ్రమవాసి వేషంలో అతడు!

"దారి తప్పి వచ్చారే?" అన్నాడు.

"లేదు. మీరే దారి తప్పిస్తున్నారు."

"నేను తప్పించడమా? మీ రెప్పుడో దారి తప్పారు."

"దారి తప్పితే ఇక్కడికెలా రాగలిగాను?"

"వచ్చి ఏం ప్రయోజనం?"

"ఏం?"

"మీ కిక్కడ ప్రవేశం లేదు?"

"నాకే ప్రవేశం లేదా?"

"అవును! మీకే ప్రవేశం లేదు. మీలాంటి వాళ్ళందరికీ అసలు ప్రవేశమే లేదు."

"కారణం?"

"పోనీ, మీకిక్కడ ప్రవేశం ఉంటుందనుకోవడానికి కారణం?"

"నేను తాగుబోతును."

"ఆఁ! అందుకే ప్రవేశం లేదు."

ఆ మాటతో విరగబడి నవ్వాను. తనివిదీర నవ్వాను. ఆశ్రమవాసులు మేల్కొనేటట్టుగా నవ్వాను. నవ్వుతుంటే బార్ మేనేజర్ మనస్సులో మెదిలాడు. ఎక్కడ బార్ మేనేజర్? ఎక్కడ ఆశ్రమవాసి?– ఇరువురి మధ్య ఎంతవ్యత్యాసం?

'ఎందుకలా నవ్వుతున్నావ్?' ఆశ్రమవాసి అడిగాడు.

"నవ్వడంలేదు. ఏడుస్తున్నాను... కాదు– మీ పరిస్థితిని చూసి ఏడవలేక నవ్వుతున్నాను. మీ ఆశ్రమంకంటే ఈ ఊర్లో బార్లు నయం. ఆ బార్‌లో ఆనందం ఉంది. అందులో ఉన్న మనుషుల్లో మానవత ఉంది. మీ వద్ద ఏమీ లేదు. అంతా నటన. కేవలం బూటకం. మీ అరవిందుడితో చెప్పండి. ఆంధ్రదేశం నుండి వచ్చిన కవి ఆజ్ఞగా చెప్పండి. హీనుల్ని, దీనుల్ని, పతితుల్ని, తాగుబోతుల్ని ఆదరించలేని ఆశ్రమాలు అపరదండగని చెప్పండి. అసలు నాలాంటి దారితప్పిన వాళ్ళను సరియైన దారిలో నడిపించడం ఆశ్రమాలు చేయవలసిన పని. ఆ ప్రయోజనాన్ని అవి సాధించలేనపుడు వాటిని వెంటనే మూసివేయమని చెప్పండి." అంటూ బిగ్గరగా అరిచాను. శక్తినంతా కూడగట్టుకొని అరిచాను. అలా అరవడంతో ఉన్న ఆ కాస్తశక్తి హరించుక పోయింది. ఎప్పుడో తిన్న అంత తిండి!... అతిగా తాగిన తాగుడు. నిలదొక్కుకోలేక పడిపోయాను. కసినంతా కక్కేసి. సొమ్మసిల్లి పడిపోయాను. అంతవరకే నాకు తెలిసింది!

నాకు తెలివివచ్చి పరిస్థితులు తెలిసివచ్చి నేను కన్నులు తెరిచిచూసినపుడు నాచూపుల్ని ఆకట్టుకొనిందొక తేజోమయ మూర్తి. ఆ మూర్తి గంభీరంగా ఉంది. విచ్చి కనిపించిన అరవిందంలా ఉంది– ఆ ముఖారవిందం. ఆ కన్నుల్లో ప్రశాంతత తొణికిసలాడుతూ ఉంది. ఆ కన్నుల్లో వెలుగు దేదీప్యమానమై నన్ను పరామర్శిస్తూ ఉంది. నా ఒంటిమీద బురద మరకల బట్టలు లేవు. నా మైల కడిగినట్లుంది. ముఖాన కంకుమబొట్టు నిర్మలంగా ఉన్న కన్నుల్లో ప్రతిఫలిస్తూంది. ఆ మూర్తి కుడిచేయి ఆప్యాయంగా నా శరీరాన్ని నిమురుతూ ఉంది. నా శరీరం గగుర్పొడిచింది. నా కన్నులు చెమర్చాయి. నా గుండె చెప్పుకోలేని అనుభూతిని పొందింది. నాకు తెలియకనే నా రెండుచేతులూ ఒక్కటై ఆ తేజోమూర్తికి నమస్కరించాయి! ●

ఆంధ్రపత్రిక
(15, మే 1973)